చిన్నకథ

"ఒరేయ్! మీ తెలుగు మేస్టారు ఎవర్రా?'' ఒక విద్యార్థి ప్రశ్న. అప్పుడే ఆయన స్కూలుకెళుతున్నారు.

''ఎర్ర తేలు మేస్టారు!'' అని మరొకడు సమాధానం. ఎర్రతేలు మేస్టారుట. ఆయన అసలు పేరేమిటో మరుగున పడిపోయింది. ఆయన ఎర్రగా ఉంటారు. అందుకు! ఒకనాడు సంస్కృతం మేస్టారు వెళుతున్నారు.

''మీ సంస్కృతం మేస్టారు ఎవర్రా?''

''గాడిత్తాపు మేస్టారు!'' ఆయన్ని గాడిద తన్నింది! అందుకు! ఆయనకు గాడిద తాపు మేస్టారు అని పేరు పెట్టాను.



# ఏకాక్షి

## బులుసు జీ ప్రకాష్

అప్పుడే హిందీ మేస్టారు వెళుతున్నారు.

''మీ హిందీ మేస్టారెవర్రా?''

''గేదెపెయ్య మేస్టారు!''

ఆయన పాఠం చెబుతూంటే గేదె పెయ్య అరుస్తున్నట్లుంటుంది.

ఇవన్నీ నేను హైస్కూల్లో చదువుతున్నప్పుడు తోటి విద్యార్థులందరితోనూ మా ఉపాధ్యాయులు వింటుండగా నేను పెట్టిన పేర్లు.

ఇహ కాలేజీ చదువుల్లో పడ్డాను.

''మీ ఎకనమిక్స్ లెక్చరర్ ఎవర్రా?''

''వంకాయ గారు''

మా ఎకనమిక్స్ లెక్చరర్‌గారు లెక్చరిస్తున్నప్పుడు ఎప్పుడు ఉదాహరణలు చెప్పినా ''మనం బొంకుల దిబ్బకెళ్లి కేజీ వంకాయలు కొన్నామనుకోండి'' అంటూండేవారు.

''మీ కామర్స్ లెక్చరర్ ఎవర్రా?''

''కప్ప గారు''

మా కామెర్స్ లెక్చరర్‌గారి మొహం కప్పలా ఉంటుంది.

ఇవన్నీ నేను విద్యార్థి దశలో పెట్టిన పేర్లు. నాతో పాటు నా తోటి విద్యార్థులందరూ వంత పాడేవారు. కేరింతలు కొట్టేవారు.

* * *

ఇప్పుడు నేనొక విశ్వ విద్యాలయంలో ఆచార్య పీఠాన్నలంకరిస్తున్నాను. ఆ మధ్య నాకు ఒక స్కూటర్ ప్రమాదంలో చావు తప్పి కన్ను 'లొట్ట'బోయింది. ''మీ ప్రొఫెసర్ గారెవర్రా?'' అని కొందరు యూనివర్సిటీ విద్యార్థులంటే ''ఏకాక్షి గారు'' అని టక్కున సమాధానం వస్తోంది.

ఇంద్రుని కొడుకు జయంతుడు శాప వశాన కాకి రూపంలో రాక్షసుడైపోయి, సీతామాత వక్షస్థలాన్ని పొడుస్తూ మాంసాన్ని భక్షిస్తుంటే శ్రీరామునికి కోపం వచ్చి, ఒక గడ్డి పోచని మంత్రించి ప్రయోగిస్తే, అది బ్రహ్మాస్త్రమై కాకాసురుని వెంటబడుతుంది. ఆ కాకి ముల్లోకాలూ తిరిగీ శ్రీరాముని వేడుకుంటే బ్రహ్మాస్త్రానికి ఏదో బలి ఇవ్వాలి కనుక తన కుడి కన్ను ఇచ్చేస్తుంది. అప్పట్నుంచీ ఆ కాకి ఏకాక్షి అయింది. పోనీ నన్ను శుక్రాచార్యులు అనైనా అనడం లేదు. అలా అంటే ఎంతో గౌరవం. శుక్రుడు ఒక గ్రహం. ఏడువారాల్లోని శుక్రవారం ఒకటి. శుక్రం వలనే సృష్టి కార్యం జరుగుతోంది. ''వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ, విత్త, మానభంగమందు బొంక వచ్చును'' అనేది రాక్షసనీతే అయినా 'శుక్రనీతి'గా ప్రసిద్ధమైంది. 'కవీనాం ఉశనా కవిః' అంటాడు కృష్ణ పరమాత్మ. ఉశన అంటే శుక్రుడు. అతడు గొప్ప కవి. బుద్ధికి బృహస్పతి అయితే, కవులలో ఆది గురువు శుక్రుడు. అతనితో ఒంటి కన్ను గలవాడనైన నన్ను సరిపోల్చకుండా, ఎంగిలి మెతుకులు తినే కాకితో నన్ను పోల్చారన్నమాట! అలా అనిపించుకోడానికే నేను అన్ని విధాల తగుదును! విద్యార్థి దశలో జ్ఞాన భిక్ష పెట్టిన ఉపాధ్యాయులను, అధ్యాపకులను పేర్లు పెట్టి వెటకారం చేయడం అనే పాపం ఊరికే పోతుందా?

★